# చరమ యాత్ర

సామానంతా డిక్కీలో సర్దేశాడు డ్రైవరు. ఆఖర్ని పట్టుకొచ్చింది ఆవిడ. పెద్ద ఫ్లాస్కు – నవ్వుకున్నాడు తనలో తను. ఎప్పుడో ఏదో హిందీ పిక్చర్‌లో చూసిన గుర్తు. ధర్మాత్ముడని పేరు గడించిన విలన్. పదిమంది శ్రోత్రియుల మధ్య కూర్చుని ఒక పెద్ద పాత్రలో నుంచి చిన్న గ్లాసులోకి పానీయం పోసుకుంటూ తాగుతుంటాడు. ఎవరో అడిగితే అది గంగాజలం అంటాడు. ఫ్లాస్కులో ఉన్నది గంగాజలం. ఆ సంగతి ఆవిడకు మాత్రమే తెలుసు! అబ్బాయికీ తెలుసు. ఒకసారి వెటకారంగా అన్నాడుకూడ.

"అబ్బాయేడి?"

అనుకోకుండా విజయవాడ వెళ్ళాడట – గోవిందమ్మ ఇంటికే – అంతకన్న అర్జెంటు పని ఇంకేముంటుంది?–

నిట్టూర్చాడు.

సెక్రటరీ చెప్పాడు: తిరుపతిలో అన్ని ఏర్పాట్లూ జరిగాయని. కొన్ని కొన్ని ఫైల్సున్నాయి సంతకాలు పెట్టవలసినవి. అవి కార్లో పెట్టానన్నాడు సెక్రెటరీ. సరే అన్నాడు తను. వాటి మీద సంతకాలు పెట్టే హక్కు నైతికంగా అతనికి లేదు. రేపు ఎన్నికల ఫలితాలు వచ్చాకా తను తిరిగి అధికారం చేపట్టగలిగితే అప్పుడు. "కాని సెక్రెటరీకి ఎందుకు చెప్పాలి. తను సంతకాలు చెయ్యదలచుకోలేదని? నిజమే, వాటిమీద సంతకాలు పెట్టేస్తే తనకి ఎన్నికల్లో ఎంతో సహాయపడ్డ ముగ్గురికి మంచి ఉపకారం జరుగుతుంది. వాళ్ళ సహాయంవల్ల తనకి ఉపకారం జరిగినప్పుడు కదా?... ఓడిపోడం ఖాయమా? ఎన్నికల ప్రచారం బ్రహ్మాండంగా జరిగింది. ఎక్కడకు వెళ్ళినా జనం, జనం జయ జయధ్వానాలు! "అబ్బాయి చాల శ్రమ పడ్డాడు. మంచి నాయకుని లక్షణాలున్నాయి అబ్బాయిలో. పార్టీ ప్రముఖుల్ని ఉద్యోగుల్ని ఒక ఆట ఆడించాడు. అల్లరిచిల్లరిగా తిరిగే అతనిలో ఇంత చాకచక్యం ఉందని తను ఊహించనైనా లేదు. కాని తన దగ్గిర వాళ్ళకే అబ్బాయి మీద అసూయ... ఎన్నికల్లో వాణ్ణికూడా నిలబెట్టడం వాళ్ళకి ఇష్టం లేదు. అకారణంగా పార్టీకి దెబ్బ అని వాదించారు కొందరు. తన స్థానంలోకి వాడెక్కడొస్తాడోనని వాళ్ళ భయం. తనలాగా నిదానంగా మాట్లాడడు అబ్బాయి. ముక్కుమీద గుద్దినట్టు చెప్పేస్తాడు; ఉన్నది ఉన్నట్టు. కుర్రాళ్ళ ఉత్సాహానికి లౌక్యానికి పొత్తు కుదరదు. నిర్ణయం తీసుకునే ముందు తను చాలా ఆలోచించాడు. అబ్బాయి ఒకటే అన్నాడు; నా ప్రతిభను అరికట్టడానికి మీకేం అధికారం వుందని! నిజమే – కాని ఒకవేళ ఎన్నికల్లో నెగ్గితే పార్టీలో నెగ్గుకు రాగలడా అబ్బాయి? అసలు నెగ్గుతాడా?... తను నెగ్గుతాడా?... తను పొరపాటు చేశాడా. అదే అబ్బాయిని కూడా నిలబెట్టడం? రాజకీయాల్లో తప్పులుండవు; పొరపాట్లే ఉంటాయి. అబ్బాయి నెగ్గినా అతన్ని మంత్రి వర్గంలోకి తీసుకోవడం జరగదు; చెయ్యకూడదు అతనెంత సమర్థుడైనా!... సమర్థుడైనప్పుడు చేస్తే ఏం? దేశానికి సమర్థులైన

నాయకులు కావాలి. కాని సమర్థులందరికీ దేశాన్ని నడిపే అవకాశం రావద్దూ? అబ్బాయికి వస్తుందా?... ఆశలాంటి నిరాశ.

ఫ్లాస్కులోంచి ఒక గుక్క చప్పరించాడు.

ఊరి పొలిమేర దాటింది, కారు; పక్కని ఆవిడ ఉన్నా లేనట్టుగా. ఆవిడతో ఇంటి విషయాలు మాట్లాడి కొన్ని ఏళ్ళయింది. అలవాటు తప్పిపోయి ఆవిడ అసలు మాటలే మరచిపోయినట్టుంది. ఎన్నో అలవాటైపోయిన దిగుళ్లు ఆవిడ ముఖంలో పేరుకుపోయాయి. అది బొమ్మలో ముఖంలాగుంటుంది. జీవం ఎక్కడో పరోక్షంగా ఉన్నట్టు మనిషికి బొమ్మలో ఉండడానికి వీలున్నా ఆత్మీయతే అతనికి ఆమెతో ఉంది. ఆమెపై జాలిలాంటి ఉద్వేగం ఏదీ అతనిలో లేదు. అతని రాజకీయానుభవంలో జాలి వంటిది నిరర్థకమైన ఉద్వేగమని అర్థమైపోయింది. వ్రణంతో బాధపడుతున్న రోగిమీద వైద్యుడికి జాలి ఉంటే లాభం లేదు. రోగికి ఏది మంచో నిర్ణయించడానికి జాలి అడ్డుపడుతుంది. వ్రణమైతే నిర్దాక్షిణ్యంగా కోసి పారెయ్యాలి. గోదావరి వరదలప్పుడు సైనిక సహకారంతో తుపాకులతో బెదిరించి నాలుగూళ్ళూ కాళీ చేయించవలసి వచ్చింది. వాళ్ళ మీద జాలి తలిస్తే వాళ్ళ ఏడుపులకి కరిగిపోయి సొంత యిళ్ళలో ఉండనిస్తే నాలుగూళ్ళ జనం నాశనమైపోయేవారు. అతడు నిర్ణయం తీసుకోబట్టే అందరూ బతికారు. ఆ తరువాత తన నిర్ణయాన్ని పొగిడారు. తనకు జోహారులర్పించారు. వాళ్ళకేది మంచో ప్రజలకి తెలియదు. తెలుసుకుని అమలు జరపాలి. ఆ విషయంలో అబ్బాయి తనకన్నా గట్టివాడు. వాళ్ళ యిళ్ళు గుడిసెలు పీకించేసి బలవంతంగా శుభ్రమైన సిమ్మెంటు ఇళ్ళలోకి మార్పించాడు. కొంచెం ఊరికి దూరమైనా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటున్నారిప్పుడు. బలవంతంగా సంతాన నిరోధం అమలు జరిపించాడు. అబ్బాయికి అధికారం ఎవరిచ్చారని పార్టీలో గోల. అతని దగ్గర అనడానికి ధైర్యం చాలక చాటుమాటుగా అనుకోవడం; మంచి చెయ్యడానికి అధికారం ఒకరియ్యాలా? ఈ పనులు చేసినందువల్ల అబ్బాయి ఒళ్లో ఏమన్నా పడుతుందా?

ఎండ! కారులోపలంతా వేడెక్కిపోయింది. రోడ్డుపక్కని ఆపమన్నాడు. దిగి ఫ్లాస్కులోది రెండు గుక్కలు తాగాడు. లోపల వేడికి చెమట పట్టింది. శరీరం చల్లబడింది. ఎండకు రాళ్ళు కాలి వేడి చిమ్ముతున్నాయి. ఎటుచూసినా గుట్టలు. దారి పక్కని మెలుకువ లేక చావలేక గిడస బారిపోయిన మరుగుజ్జు చెట్లు. భారతదేశం!

ఎవరో పలకరించారు. ఎవరో రైతు. అలవాటు ప్రకారం సెంటు ధారాళంగా జల్లిన జేబురుమాలు తీసి ముక్కు దగ్గర పెట్టుకున్నాడు; వాసన ఎదటి వాడికి తెలీకండా. ఆ రైతు కుశల ప్రశ్నలడిగాడు. తన ఇంటికి వచ్చి చల్లబడేదాకా విశ్రమించమన్నాడు రైతు. తనకు జరూరు పనుందని చెప్పి కార్లో ఎక్కాడు. అతని ఇంటికిపోతే మంచి ఆతిథ్యమే లభించవచ్చు. కాని ఊరి జనమంతా చేరుతారు. జనాన్ని ఆ వేళ తట్టుకోలేడు. ఈవేళ తనకి కావలసింది ఏకాంతం. తనలో తను ఎన్నికల ప్రచారంలో లక్షలాది జనం తన చుట్టూ. రాత్రీ పగలూ వేరువేరు వ్యక్తుల కూడలి కాదు. ముద్ద కట్టుకుపోయిన సమూహం. ఆ ఒత్తిడినుంచి ఈ రెండు రోజులే, విడుదల!

పేకాటంటే పిచ్చి. ఒకప్పుడు. తాగడమంటే మహా సరదా. కొన్ని రాత్రులు తాగుతూ పేకాడుతూ గడిపేవాడు. అడిగేవాడు లేడు. ఒక్క తండ్రి తప్ప! ఆయన విక్టోరియా మహారాణి మానసపుత్రుడు. జిల్లా కలెక్టరు, దివాన్ బహదూర్.

ఆ రాత్రి బాగా గుర్తు... రాత్రేమిటి. తెల్లవారిపోతూంది. తండ్రి హాల్లో కూర్చుని ఉన్నాడు. ఇంటికి చేరేసరికి పాతకాలపు ఇంగ్లీషు నవల్లోలాంటి ఘట్టం నడచింది ఇద్దరి మధ్య. తండ్రి నిరసనా దూషణా కూడా మహా మర్యాదగా ఉండేవి; అంతా ఇంగ్లీషులో-

మర్నాడు తనని రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌గా వేయించేశాడు. వారం రోజులు తిరక్కుండా పెళ్ళి చేసేశాడు. పోయిన స్వేచ్ఛకోసం తపన... ఉద్యోగం మీద. ఇంగ్లీషు వాళ్ళమీద తిక్క. పెళ్ళాం మీద కూడా. తండ్రి నిర్ణయించిన పిల్ల కనుక.

తండ్రి ఉద్ఘాటన ఇంగ్లీషు వాళ్ళ నాగరికతను గురించి. వాళ్ల గొప్పతనాన్ని గురించి. వాళ్ల నిజాయితీని గురించి... తను మరునాడే క్విట్ ఇండియా ఉద్యమంలో చేరాడు. తన విముక్తికి దేశ విముక్తికి అవినాభావ సంబంధం కనిపించింది. జైల్లో ఉండగా తండ్రి వచ్చి క్షమాపణ రాసి ఇచ్చెయ్యమన్నాడు.

తను చెప్పిన సమాధానం: తను తప్పు చెయ్యలేదని నమ్ముతున్నప్పుడు క్షమాపణ రాసి ఇవ్వడం తప్పుకదా! ఏ ఇంగ్లీషు వాడైనా అలా చేస్తాడా?... తండ్రి ఇంక మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు. రెండేళ్ళ తరువాత తను జైలునుంచి తిరిగి వచ్చేసరికి తండ్రి లేడు.

తండ్రిలాంటి కొడుకు; కొడుకులాంటి తండ్రి?... కాదుకాదు... తన కొడుకు విషయంలో తను తండ్రిలా వ్యవహరించాడా?... లేదు, లేదు!... వాడు లెక్చరర్‌ని కొట్టి పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌లో ఉన్నప్పుడు తను వెళ్ళి మాట్లాడిన ఘట్టం వెనకటి ఘట్టంలాగే కనుపించవచ్చును. కాని ఏ తిక్క కొద్దైన సరే; తను క్విట్ ఇండియా ఉద్యమంలో చేరడం తన కొడుకు లెక్చరర్‌ని కొట్టడం ఒకటి కాదు. పైగా తను, తన తండ్రిలా గంభీరోపన్యాసం చెయ్యలేదు. ఫెడీ ఫెడీ చెంపలు వాయగొట్టాడు. కొడుకు చటుక్కుని తన చెయ్యి పట్టుకున్నాడు. తీవ్రంగా చూస్తూ అన్నాడు. "ఆ లెక్చరర్ నీకన్నా బలవంతుడు. ఆగలేకపోయాడు, నా ధాటికి. ఇంకోసారి చెయ్యెత్తావంటే నీ మర్యాద దక్కదు" తనకి నోట మాటరాలేదు. పైగా ఎస్.ఐ ముందు! "నీ కర్మం!" అనేసి వెళ్ళిపోయాడు. కాని మనసెల్లా ఒప్పుతుంది? తన పలుకుబడి ఉపయోగించి విడిపించక తప్పలేదు.

ఆ రాత్రి మర్యాదగా హితబోధ చేశాడు. తన బోటి వాళ్ళు గాజు ఇళ్ళలో ఉంటున్నారు. పైవాళ్ళకి రాళ్ళు రువ్వే అవకాశం యివ్వకూడదు. కొడుకు తిరుగుళ్ళు అతని స్నేహాల మూలంగా తనకి చెడ్డ పేరొస్తుంది...

కొడుకు అన్నాడు "నీలా రహస్యంగా తిరగాల్సిన ఖర్మ నాకేం పట్టింది. లక్ష్మీదేవిలాంటి అమ్మ ఇంట్లో ఉండగా శూర్పణఖ సుందరమ్మ ఇంట్లో తాగుతూ తందనాలు ఏమిటి నీకు ఇన్నేళ్ళొచ్చి? పైగా నన్నంటావెందుకూ?"

అతని తల తిరిగిపోయింది. సుందరమ్మతో స్నేహం కేవలం రాజకీయమని వాడికెలా బోధపరచడం?

చల్లబడింది. మరో గుక్క గంగాజలం సేవించాడు. ఫ్లాస్కు - మూత పెడుతున్న భార్యవంక చూశాడు - నిజంగా అందమైనది, తన భార్య. పైగా భూదేవి లాంటి సహనం

ఉంది ఆమెలో. భూదేవిలాంటి స్తబ్ధత్వం కూడా కాదు. ఎప్పుడూ అలా లేదు. పెళ్ళయిన కొత్త రోజుల్లో తను తాగేసి ఏ రాత్రివేళ వచ్చినా చిరునవ్వుతో ఎదురొచ్చేది. అప్పుడు చిరునవ్వులో వెలుగు ఉండేది. క్రమంగా అది తగ్గిపోయింది. కారణం తనా? కొడుకు అన్నది నిజమేనా? నిజంగా ఆమెను నిర్జీవ జీవిగా చేసింది తనేనా?... తన తండ్రి చేసిన పొరపాటు తను చెయ్యలేదు. కొడుక్కి పిల్లను చూసి తను చెయ్యలేదు. వాడే చేసుకున్నాడు. ముస్లిం పిల్లని - హిందూ మహమ్మదీయ సమ్మేళనం - తానే ఆధ్వర్యం వహించాడు. చాటున కొందరు వెక్కిరించారు. కొందరు అసహ్యించుకున్నారు. కానీ పెళ్ళిలో ఇది ఆదర్శ వివాహమని అందరూ కొనియాడారు. పైగా తన్ను పొగిడారు. నటన... నటన... జీవన విధానమైపోయింది. తెలుసు తనకు. శత్రువులెవరో వాళ్ళకీ తెలుసు. తనకి తెలుసునని. ఎదురుపడ్డప్పుడు ఒక పేగున పుట్టిన అన్నదమ్ముల్లాగ అతి ఆప్యాయంగా కౌగలించుకుంటాడు. పెళ్ళయిన తర్వాతయినా కొడుకు ఒక దారిని పడలేదు. ప్రతినిత్యం ఇంట్లో అరుపులు; కొట్లాటలు - డ్రెస్సింగ్ టేబిల్ అద్దం పగిలిపోయింది - జెకోస్లావేకియానుంచి ఎవరో తెచ్చి యిచ్చిన కప్పులూ సాసర్లు నామరూపం లేకుండా అయిపోయాయి. కొడుకూ కోడలూ ఒకళ్ళమీద ఒకళ్ళకున్న అక్కసు సామాన్ల మీద తీర్చుకుంటున్నారు. సుందరమ్మతో చెప్పుకున్నాడు ఒక రాత్రి. ఆమె సలహా, అబ్బాయిని రాజకీయాల్లోకి దింపమని - తను తటపటాయించాడు. కాని ఆమె సలహాతో ఆపలేదు. తనమీదనే యువతా రాజ్య పక్షం ఆవిర్భవించింది. ఇంట్లో పరిస్థితులు చక్కబడ్డాయి. ప్రారంభోత్సవంనాడు మొట్టమొదట తల్లికాళ్లకి దండం పెట్టాడు. తనకి ఆశ్చర్యం వేసింది - పైగా అన్నాడు : దేశంలో మంచితనం ఎక్కడున్నా ఆమెలాంటి వాళ్ళలోనే ఉందన్నాడు. అంచేత తన ఆశీర్వచనం తన ఉద్యమానికి అవసరం అన్నాడు. అబ్బాయికి తల్లిమీద అంత యిష్టమని అతడు ఊహించనైనా లేదు. బహుశా అదే కారణమేమో, వాడికీ పెళ్ళానికీ మధ్య తగాదాలు రావడానికి - ఉద్యమంలో పడ్డాకా వాడి ముఖానికి కొత్త వెలుగు వచ్చింది. వాడి పేరు మోగిపోయింది. వాడిని చూసి గర్వపడ్డాడు. అటువంటి చాకచక్యం వృథాపోతే ఎలా? అంత పలుకుబడి ఏటిపాలైతే ఎలా? అందుకే వాడికి పార్టీ టిక్కెట్టు ఇప్పించాడు.

కొండల వెనక కూలిపోతున్న సూర్యుడు ఎర్రగా వెలిగించాడు. పడమటి ఆకాశమంతా చరమ దిక్కంతా కాని వస్త్రాలు ధరించింది. ఎక్కడో చదివిన పద్య పాఠం: "చరమ" అంటే పడమటి - అని అర్థం వుందట - తన ప్రయాణం పడమటి దిక్కున. చరమ ప్రయాణం? - ఛీఛీ- ఇది ఆఖరు ప్రయాణం మాత్రం కాదు. తను నెగ్గి తీరుతాడు. తప్పకుండా తను మళ్ళీ అధికారం చేపడతాడు - అబ్బాయి? - వాడు పైకి రావడానికి అడ్డుపడే సైంధవులు చాలామంది ఉన్నారు. కాని ప్రతిభా చాకచక్యం వ్యక్తిత్వం ఉన్న మనిషి పురోగతిని ఎవరు ఆపగలడు?

సంజవెలుగులో ఆమె ముఖం వింతగా కనిపించింది. యోగిని ముఖంలాగ. కట్టుకున్న తెల్లచీరకు కావిరంగు వచ్చింది. అన్ని బంధాలు తెంచుకుని సన్యసించినట్టు, పగలల్లా ఒక్కలాగ వెలిగిన సూర్యుడు కుంగిపోతున్నాడు. దిగులుగా.

తన జీవితమంతా ప్రజల కోసం ధారపోశాడు: తన కొడుకు ప్రజా సేవలో మునిగి తేలుతున్నాడు. ఈ ప్రజకు కృతజ్ఞత లేదు. తన సభలకు తండోప తండాలుగా వచ్చారు. తన కొడుకును అందల మెక్కించారు. కాని తమ ఓట్లు తీసికెళ్లి అసమర్థులకూ - మోసగాళ్ళకు వేశారు. తనూ తన కొడుకూ ఓడిపోతే ఇంక దేశానికి గతేమిటి? అధికారం స్వార్థపరుల చేతుల్లో పడితే ప్రజలకు విముక్తి ఏమిటి?

తిరుపతి కొండమీద దారిచూపే దీపాలు అప్పుడే వెలిగాయి. -

యాత్ర పూర్తయింది.

చరమయాత్ర.

**(జాగృతి : దీపావళి 1978)**